


> ‘ఆపరేషన్ సిందూర్’ దేశ ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని పెంచింది. భారత సైన్యం, కేంద్రం ఉగ్రవాదాన్ని అంత మొందించాయి. పహల్గాంలో ఉగ్రదాడి పిరికిపందల చర్య. పాక్‌కు దీటుగా బదులిచ్చిన భారత సైన్యానికి, కేంద్రానికి అభినందనలు - ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

# దేశమంతా హై అలర్ట్

## భద్రతను లెవల్ - 1 నుంచి లెవల్ - 2కు పెంచిన కేంద్రం

- పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రత పెంపు
- షిప్‌యార్డులు, నౌకలు, ఎయిర్‌పోర్టులు, వైమానిక స్థావరాలు, రక్షణ కేంద్రాలు ఇలా అన్ని ప్రాంతాల్లో హై సెక్యూరిటీ
- ఆదేశాలు తక్షణమే అమలు చేయాలని డైరెక్టరేట్లకు సందేశం
- ఢిల్లీలో పటిష్ట భద్రత.. బహుళ అంతస్తుల భవనాలపై సైరన్లు ఫిక్స్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకొన్నది. దేశంలోని పోర్టులు, షిప్‌యార్డులు, టెర్మినళ్లలో భద్రతను పెంచింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. మరోవైపు, ఢిల్లీ సహా అన్ని విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను అధికారులు మెరుగుపర్చారు. ఇందులో భాగంగా అన్ని విమానాలకు సెకండరీ లాడర్ పాయింట్ చెకింగ్‌ను బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) తప్పనిసరి చేసింది. ఇంకోవైపు, భారత సరిహద్దు నగరాల్లో పాకిస్థాన్ మరిన్ని దాడులకు పాల్పడే ప్రమాదమున్నదన్న ముందస్తు సమాచారంతో ఇప్పటికే రాజధాని ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన కేంద్రం.. ప్రజలను అలర్ట్ చేయడానికి సైరన్లను వినియోగించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఇందుకోసం 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని నియమం-11ను వినియోగించుకోవాలని, సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనేందుకు అవసరమైన పూర్తి అధికారాలను ఇస్తున్నట్టు ప్రకటించింది. ఇదిలాఉండగా.. ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు. అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### నిఘా నీడలో నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టులు

దాయాది దేశం పాకిస్థాన్‌తో ఘర్షణ వాతావరణం నెలకొన్న క్రమంలో తీర ప్రాంతాల్లోని పోర్టులు, షిప్‌యార్డులు, నౌకలు, టెర్మినల్స్‌లో భద్రతను ఎంఏఆర్ఎస్ఈసీ లెవల్-1 (సాధారణ సెక్యూరిటీ) నుంచి ఎంఏఆర్ఎస్ఈసీ లెవల్-2కు (అదనపు సెక్యూరిటీ అండ్ పటిష్ట నిఘా) పెంచాలని చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్లకు (సీఐఎస్‌వో) కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ముంబైలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక ప్రకటనలో తెలిపింది. సైబర్ దాడులు జరిగే ప్రమాదం ఉన్న రీత్యా పోర్టుల్లో ఐటీ, కమ్యూనికేషన్ వ్యవస్థల భద్రతపై సమీక్షను నిర్వహించాలని సూచించింది. ‘తీర ప్రాంత భద్రత దృష్ట్యా ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రకటన వెలువడిన వెంటనే అత్యంత ప్రాధాన్యతతో వీటిని అమలు చేయాలని సూచనలు వచ్చాయి. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయి’ అని డిప్యూటీ నాటికల్ అడ్వైజర్, సీనియర్ డీడీజీ (టెక్) కెప్టెన్ నితిన్ ముకేశ్ తెలిపారు. మరోవైపు, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో భద్రతను పెంచారు. విమానాశ్రయ టెర్మినల్ భవనాల్లోకి సందర్శకుల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు బీసీఏఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని విమానాలకు సెకండరీ లాడర్ పాయింట్ చెకింగ్‌ను తప్పనిసరి చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా విమానాశ్రయాలు, వైమానిక స్థావరాలు, వైమానిక దళ స్టేషన్లు, హెలిప్యాడ్లు, ఏవియేషన్ శిక్షణ కేంద్రాలు, పౌర విమాన కేంద్రాల్లో భద్రతను పటిష్ఠం చేసింది.



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

### ఢిల్లీలో హై అలర్ట్

ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. ప్రభుత్వోద్యోగులకు సెలవులు రద్దు చేశారు. ఇండియా గేట్ సహా పలు కట్టడాలు, పరిపాలన భవనాలు, మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, మాల్స్, పార్కులు, మెట్రోస్టేషన్ల వద్ద భద్రతను పెంచారు. ఇండియా గేట్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. అడుగడుగునా తనిఖీలు ముమ్మరం చేశారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా వైద్య, విపత్తు నిర్వహణ విభాగాల సంసిద్ధతను సమీక్షిస్తున్నారు. అలాగే ఎటువంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఢిల్లీలోని 11 రెవెన్యూ జిల్లాలను సంసిద్ధం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా గరిష్ఠంగా 16 కిలోమీటర్ల పరిధి వరకూ వినిపించే సైరన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ జిల్లాలో కనీసం 10 సైరన్లను ఏర్పాటు చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాల మీద 40 నుంచి 50 సైరన్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ శుక్రవారం తెలిపారు. సైరన్లు ఎలా పనిచేస్తున్నాయన్న దానిపై రిహార్సల్ పరీక్షలను ఇప్పటికే నిర్వహించినట్టు వెల్లడించారు. కాగా భద్రతా కారణాల రీత్యా ఢిల్లీ విమానాశ్రయం నుంచి శుక్రవారం 138 విమాన సర్వీసులు రద్దయినట్టు అధికారులు తెలిపారు.

### భద్రతను పెంచిన ప్రాంతాలివే..

పోర్టులు, షిప్‌యార్డులు, నౌకలు, టెర్మినల్స్, విమానాశ్రయాలు, వైమానిక స్థావరాలు, వైమానిక దళ స్టేషన్లు, హెలిప్యాడ్లు, ఏవియేషన్ శిక్షణ కేంద్రాలు, పౌర విమాన కేంద్రాలు, ఆయుధ కర్మాగారాలు, డిఫెన్స్ రిసెర్చ్ అండ్ టెస్టింగ్ సెంటర్లు, ఆర్థిక సంస్థలు, పరిపాలన భవనాలు, కట్టడాలు, న్యాయస్థానాలు, సీవరేజీ ప్లాంట్లు, ఆహార నిల్వ గోదాములు.

### అవసరమైతేనే అక్కడికి..

**భారత్,** పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ట్రావెల్ ఏజెన్సీ సంస్థ ఈజీమైట్రిప్ భారత్‌లోని తన వినియోగదారులకు కీలక సూచనలు చేసింది. తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలు పాక్‌కు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆయా దేశాలకు అత్యవసరమైతేనే పర్యటించాలని సూచించింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

## ఏడుగురు ముష్కరుల హతం

- సరిహద్దులో చొరబాటు యత్నం
- మట్టుబెట్టిన సరిహద్దు భద్రతా దళం

న్యూఢిల్లీ/జమ్ము, మే 9: పాక్‌తో సాయుధ ఘర్షణ జరుగుతున్న పరిస్థితిని అడ్డం పెట్టుకొని సరిహద్దు దాటి చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదులను హతం చేసినట్టు సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) శుక్రవారం ప్రకటించింది. జమ్ములోని భారత్-పాక్ మధ్యనున్న అంతర్జాతీయ సరిహద్దు నుంచి ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించారని తెలిపింది. సాంబా జిల్లాలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఉగ్రవాదులతో కూడిన పెద్ద గుంపును తమ సర్వేలెన్స్ గ్రిడ్ గుర్తించిందని పేర్కొంది. ధన్‌దార్ పోస్టు నుంచి పాకిస్థాన్ రేంజర్లు ఓవైపు భారత్‌పై కాల్పులు జరుపుతుండగా, వాటి ఆసరాగా ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారని వివరించింది. బీఎస్ఎఫ్ దళాలు చొరబాటుదారులపై పెద్ద ఎత్తున విరుచుకుపడ్డాయని, ఈ కాల్పుల్లో ఏడుగురు ఉగ్రవాదులు హతమయ్యారని, ధన్‌దార్ పోస్టు కూడా భారీగా ధ్వంసమైందని తెలిపింది. మరణించిన ఉగ్రవాదుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండవచ్చునని అధికారులు పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ కాల్పుల్లో బంకర్ ధ్వంసమైన దృశ్యాలకు సంబంధించిన ఓ వీడియోను బీఎస్ఎఫ్ విడుదల చేసింది.



## చండీగఢ్‌లో సైరన్‌ల మోత

- ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి

చండీగఢ్: పంజాబ్‌లో పలు ప్రాంతాల్లో శుక్రవారం అధికారులు తాజాగా వైమానిక దాడుల హెచ్చరికల సైరన్ మోగించారు. చండీగఢ్‌లో అధికార యంత్రాంగం సైరన్ మోగించి ప్రజలను ఇండ్లలోనే ఉండమని విజ్ఞప్తి చేసింది. ‘దాడులు జరిగే అవకాశం ఉండొచ్చని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి హెచ్చరిక వచ్చింది. దీంతో ప్రజలందరినీ ఇండ్లలోనే ఉండమని విజ్ఞప్తి చేశాం. బాల్కనీలు, బహిరంగ ప్రదేశాలు, పైకప్పులపైన ఉండొద్దని కోరాం’ అని పేర్కొన్నది. గంట తర్వాత సైరన్ హెచ్చరిక ముగిసింది. చండీగఢ్ పక్కనే ఉన్న పంచకులలోనూ సైరన్ మోగింది. చండీగఢ్ సరిహద్దుల్లో నివసించే మొహాలీ జిల్లా ప్రజలు కూడా ఇండ్లలోనే ఉండాలని అధికార యంత్రాంగం సూచించింది.



## త్రివిధ దళాధిపతులతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ కొన్ని రోజుల వ్యవధిలోనే త్రివిధ దళాల అధిపతులతో శుక్రవారం మరోసారి సమావేశమయ్యారు. ఈ నెల 8న, 9న రాత్రి వేళల్లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పులు, జమ్ము, కశ్మీర్‌లోని పలు నగరాలపై డ్రోన్ దాడి యత్నాలు, దేశ పశ్చిమ సరిహద్దులో సైన్యం సన్నద్ధతపై చర్చించారు. మాజీ త్రివిధ దళాల అధికారులతోనూ మోదీ సమావేశమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలతో తాజా పరిస్థితులపై శుక్రవారం వారితో చర్చించినట్టు చెప్పారు. మరోవైపు పాక్ చొరబాట్ల నేపథ్యంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ తదితరులతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమీక్ష నిర్వహించారు.

### సీడీఎస్‌తో రాజ్‌నాథ్ భేటీ

దేశంలోని సైనిక స్థావరాలపై దాడులకు పాక్ యత్నించిన మరుసటి రోజైన శుక్రవారం నాడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాల అధిపతులతో దేశ భద్రతపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ చీఫ్‌లు, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమావేశంలో పాల్గొన్నారు.

### వైద్య సదుపాయాలపై నడ్డా సమీక్ష

దేశంలోని వైద్య సదుపాయాల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భారత్-పాక్ సైన్యాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన ఈ సమావేశం నిర్వహించారని అధికార వర్గాలు తెలిపాయి.

### బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం రావొద్దు: నిర్మల

భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బ్యాంకులకు సూచించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

**SECUNDERABAD CANTONMENT BOARD**
(Ministry of Defence, Govt. of India)
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003
Tel No: 040-27808600 / 040 - 27808601
Email ID: ceo.scb2009@gmail.com, Website : secunderabad.csntt.gov.in

**STORES DEPARTMENT**
**AUCTION NOTICE**

It is hereby notified for information of the general public that the uprooted / fallen trees / tree branches / firewood (approx.16 tonnes) of the Secunderabad Cantonment area in the premises of Picket Garden, Secunderabad will be disposed of through public auction to be held in the office of the Secunderabad Cantonment Board, SP Road, Court Compound, Secunderabad - 500 003, on **14-05-2025 @ 12:00 PM.** The intending contractors will be allowed to visit and inspect the said trees and location in consultation with the Incharge Horticulture. **(Mobile No. 9490611187).** You are required to visit the office of the Cantonment Board Secunderabad/ office website **“secunderabad.cantt.gov.in”** for further details and terms and conditions.

Date: 09-05-2025
Sd/- Chief Executive Officer,
Secunderabad Cantonment Board.

## అవసరమైతే రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ!

- సైనిక రిజర్వు దళాన్ని దించాలని కేంద్రం నిర్ణయం
- సైన్యాధ్యక్షుడికి మరిన్ని అధికారాలు
- టెరిటోరియల్ ఆర్మీలో కపిల్‌దేవ్, ధోనీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీ (సైనిక రిజర్వు దళం)ని రంగంలోకి దించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు సైన్యాధ్యక్షుడి అధికారాలను విస్తరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం టెరిటోరియల్ ఆర్మీకి చెందిన ప్రతి అధికారి, నమోదు చేసుకున్న సిబ్బందిని అవసరమైతే గార్డు విధులు లేదా రెగ్యులర్ ఆర్మీకి మద్దతుగా పూర్తిస్థాయి సేవల కోసం పిలిపించుకునేందుకు సైన్యాధ్యక్షుడికి అధికారం ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న 32 టెరిటోరియల్ ఆర్మీ పదాతిదళ బెటాలియన్లలో 14 బెటాలియన్లను భారత సైన్యంలోని ప్రధాన కమాండ్లు అయిన దక్షిణ, తూర్పు, పశ్చిమ, మధ్య, ఉత్తర, దక్షిణ పశ్చిమ, అండమాన్ నికోబార్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ (ఏఆర్‌టీఆర్ఏసీ) సహా మోహరించేందుకు ప్రత్యేక ఆమోదం లభించింది. ఈ ఉత్తర్వు 2025 ఫిబ్రవరి 10న ప్రారంభమై 2028 ఫిబ్రవరి 9 వరకు మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. టెరిటోరియల్ ఆర్మీనే సైనిక రిజర్వు దళం అని కూడా పిలుస్తారు. దేశానికి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు ఆర్మీకి మద్దతుగా ఈ దళం సిద్ధంగా ఉంటుంది. వీరు బయట ఉద్యోగాలు చేసుకుంటూనే సైన్యంలో స్వచ్ఛందంగా సేవలు అందిస్తారు. ఈ టెరిటోరియల్ ఆర్మీలో టీమిండియా దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వంటి ప్రముఖులు గౌరవ హోదాలో ఉన్నారు.



# 400 డ్రోన్లతో పాక్ దాడి

- అన్నింటినీ కూల్చేసిన భారత సైన్యం
- పౌర విమానాలను రక్షణ కవచంగా వాడుతూ దాడికి పాకిస్థాన్ యత్నం
- విదేశాంగశాఖ కార్యదర్శి, సైన్యం వెల్లడి

న్యూఢిల్లీ, మే 9: భారత్‌పై దాడికి పాక్ సైన్యం టర్కీ తయారీ డ్రోన్లను ప్రయోగించిందని సైనికాధికారులు శుక్రవారం వెల్లడించారు. భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్ములోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ వరకు 36 కీలక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని సుమారు 400 డ్రోన్లతో పాక్ దాడికి పాల్పడినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ వివరించారు. పౌర విమానాలను కవచంగా మార్చుకొని, వాటి మాటున వైమానిక దాడులకు పాల్పడిందని తెలిపారు. భారత్‌లో కూలిన ఆ డ్రోన్ల శిథిలాలను పరిశీలించినప్పుడు అవి టర్కీలో తయారైన ‘ఆసిస్‌గార్డ్ సోంగర్’ మాడల్ డ్రోన్లని వెల్లడైందని తెలిపారు. పాక్ సైన్యం గురువారం రాత్రి దేశ పశ్చిమ సరిహద్దు వైపు అనేకమార్లు మన గగనతలాన్ని ఉల్లంఘించిందని వ్యోమికాసింగ్ చెప్పారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి భారీ ఆయుధాలతో కాల్పులు జరిపిందని తెలిపారు. తొలుత పాక్‌కు చెందిన నిరాయుధ డ్రోన్ భటిండా మిలిటరీ స్టేషన్‌వైపు వచ్చిందని, దానిని గుర్తించిన సైన్యం వెంటనే కూల్చివేసిందని చెప్పారు. ఉభయ దేశాల మధ్య డ్రోన్ల దాడికి అదే ప్రారంభం అని అన్నారు. పాక్ డ్రోన్ల దాడికి భారత్ దీటుగా జవాబు చెప్పిందని అన్నారు. పాక్‌కు చెందిన నాలుగు గగనతల రక్షణ స్థావరాలపైకి సాయుధ డ్రోన్లను ప్రయోగించామని చెప్పారు. తాము ప్రయోగించిన డ్రోన్లలో ఒకటి పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేసిందని తెలిపారు. పాక్ దుస్సాహసం డ్రోన్లకే పరిమితం కాలేదని అన్నారు. నియంత్రణ రేఖ వెంట భారీ ఆయుధాలతో కాల్పులు కొనసాగించిందని చెప్పారు. పాక్ దాడుల్లో మన సైన్యానికి కూడా కొంత నష్టం జరిగిందని, కొందరు గాయపడ్డారని ఈ సందర్భంగా తెలిపారు.

### ప్రార్థనా స్థలాలపై పాక్ దాడి

ప్రార్థనా స్థలాలపై దాడులు చేస్తున్న పాక్ ఆ నిందను భారత సైన్యంపై వేస్తున్నదని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిశ్రీ చెప్పారు. ఇది ప్రపంచ దేశాలను తప్పుదోవ పట్టించే పాక్ దుష్టయత్నమని పేర్కొన్నారు. అమృత్‌సర్‌లోని ఓ గురుద్వారాపై దాడి జరిపిన పాక్ ఆ నిందను భారత సైన్యంపై వేయడాన్ని ప్రస్తావించారు.



పాక్ డ్రోన్లను ధ్వంసం చేస్తున్న భారత్

### డ్రోన్ దాడులు మేం చేయలేదు: పాక్

భారత్‌లోని అనేక ప్రదేశాలపై తాము దాడులు నిర్వహించినట్లు భారతీయ మీడియాలో వచ్చిన వార్తలను పాకిస్థాన్ శుక్రవారం ఖండించింది. ఇవన్నీ నిరాధార వార్తలని, నిర్లక్ష్య ప్రచారంలో భాగమని పాక్ ఆరోపించింది. ఇటువంటి చర్యలు ప్రాంతీయ శాంతిని మరింత దెబ్బతీస్తాయని పాక్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ శుక్రవారం మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉద్దేశపూర్వకంగానే తాము భారతీయ డ్రోన్లను అడ్డుకోలేదని, వాటిని తాము కూల్చివేస్తే భారతీయ దళాలకు పాక్ రక్షణ స్థావరాల ఉనికిని చూపించినట్లవుతుందని వ్యాఖ్యానించారు. గురువారం పాకిస్థాన్ జరిపిన దాడులకు భారత్ దీటుగా సమాధానం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### పాక్ డ్రోన్ల దాడిని తిప్పికొట్టాం.. కూల్చివేశాం: భారత సైన్యం

న్యూఢిల్లీ, మే 9: పశ్చిమ సరిహద్దుల వెంబడి గురువారం రాత్రి పాకిస్థానీ సాయుధ దళాలు డ్రోన్లు, ఇతర ఆయుధాలతో వరుస దాడులు జరిపిందని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని భారతసైన్యం శుక్రవారం ప్రకటించింది. జమ్ము కశ్మీరులోని నియంత్రరేఖ వెంబడి పాకిస్థానీ రేంజర్లు అనేక చోట్ల కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఎక్స్ వేదికగా భారతీయ సైన్యం వెల్లడించింది. దీంతో పాటు ఓ చిన్న వీడియో క్లిప్‌ను జతచేసిన సైన్యం అన్ని నీచ కుట్రలను దీటుగా తిప్పికొడతామని హెచ్చరించింది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్ము కశ్మీరులోని జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లోని సైనిక కేంద్రాలపై డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థానీ సేనలు దాడులకు ప్రయత్నించాయని, వాటిని కైనెటిక్, నాన్ కైనెటిక్ సామర్థ్యాలతో నిర్వీర్యం చేశామని గురువారం అర్ధరాత్రి ఒక ప్రకటనలో రక్షణ శాఖ తెలిపింది.

